ఎమ్మెల్యే లలితకుమారిని కలిసిన అంగన్వాడీ కార్యకర్తలు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఎస్.కోట మండలానికి చెందిన అంగన్వాడీ కార్యకర్తలు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్.కోట సెక్టార్ తరపున ఎమ్మెల్యే లలితకుమారిని సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. తనను కలిసిన అంగన్వాడీ కార్యకర్తలను ఎమ్మెల్యే లలితకుమారి అభినందించారు. సెక్టార్ లీడర్లు మద్ది మాణిక్యం, శ్యామల తదితరులు ఉన్నారు.

సెంచూరియన్ విద్యార్థి చైతన్యకు రూ.50 లక్షల ప్యాకేజీ

విశాలాంధ్ర - నెల్లిమర్ల : సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ లో బిటెక్ పూర్తి చేసిన కుసుమంచి చైతన్యకు నెదర్లాండ్స్‌కు చెందిన ప్లాంక్ నెట్ వర్క్ సంస్థలో రూ.50 లక్షల ప్యాకేజీకి ఎంపిక కావడం పట్ల శనివారం ఆయనను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మహంతి మాట్లాడుతూ కష్టపడి చదివిన వారికి మంచి ఫలాలు అందుతాయనడానికి చైతన్య ఒక ఉదాహరణగా పేర్కొన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని మిగిలిన విద్యార్థులు ఆ స్థాయికి చేరుకోవాలన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో నైపుణ్యాలను పెంచుకోవడానికి సెంచూరియన్ ఒక మంచి వేదిక అన్నారు. దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ తాను ఒక సాధారణ కుటుంబంలో జన్మించానని ఈ స్థాయికి ఎదుగుతానని ఊహించలేదన్నారు. తన హైస్కూల్ విద్యాభ్యాసం అంతా విజయనగరంలో కొనసాగిందన్నారు. తనకు నెదర్లాండ్స్ లోని ప్లాంక్ నెట్ వర్క్ సంస్థ ఏడాదికి రూ.50 లక్షలకు తనను ఎంపిక చేయడం పట్ల తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. దాంతోపాటు ఫ్లిప్ కార్ట్ లో రూ.32 లక్షలకు ఎంపికయ్యానన్నారు. ఐఐటి చదివిన విద్యార్థుల కంటే మెరుగ్గా తాను పోటీ ఇవ్వగలిగానన్నారు. సెంచూరియన్ లో విద్యార్థులు కాలాన్ని వృథా చేయకుండా తమ నైపుణ్యాలను పెంచుకోగలిగితే మంచి ఉపాధి అవకాశాలు పొందుతారనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. ఇక్కడ అధ్యాపక బృందం డీన్ డాక్టర్ సన్నీ డయోల్, డాక్టర్ లక్ష్మణరావు కూడా తనకు ఎంతగానో ప్రోత్సహించారని గుర్తుచేసుకున్నారు.

రామోజీ మృతి పత్రికా రంగానికి తీరని లోటు

జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ మజ్జి శ్రీనివాసరావు

విశాలాంధ్ర - విజయనగరం : ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతి యావత్ పత్రికా రంగానికి తీరని లోటని, జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆయన ఆకస్మిక మరణం పట్ల ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. తెలుగు దిన పత్రికను తెలుగువారి లోగిళ్ళకు చేర్చిన ఘనత రామోజీరావు కే దక్కిందన్నారు. పత్రికా రంగంలో ఆయన చేయని ప్రయోగాలు లేవని, పాత్రికేయ రంగంలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. కష్టపడి పనిచేస్తే ఎంతటి ఉన్నత స్థానానికి చేరుకోవచ్చునని, రామోజీ జీవితాన్ని చూసి నేర్చుకోవచ్చునని తెలిపారు.

బొబ్బిలి : ఆధునిక మీడియా సామ్రాట్, ఈనాడు ఈటివి మూలవిరాట్, ప్రపంచం లోనే అతిపెద్ద సినిమా స్టూడియో రామోజీ ఫిలిం సిటీ సృష్టి కర్త దేశంలో ఈనాడును శాఖో పశాఖలుగా విస్తరింపచేసి దాని నీడలో జర్నలిస్టులకు, పాత్రికేయులకు, రచయితలకు, కవులకు, భాషావేత్తలకు, కళాకారులకు ఆశ్రయం కల్పించి బ్రతుకు దెరువు చూపినవాడు, సమాజాహిత రచనలతో, ప్రత్యేకించి ఈనాడు ఈటివి ద్వారా తెలుగుభాష పరిరక్షణకు, చైతన్యానికి అలుపెరుగని కృషి చేసినవాడు, తెలుగు పాఠకుని విశ్వాసనీయతను చూరగోనెల ఈనాడును మలచిన అక్షర శిల్పి, ఈనాడు అధినేత పద్మ విభూషణ్ రామోజీ ఆకస్మిక మరణం పత్రిక రంగానికి తీరని లోటుని రామోజీరావు అకాల మృతికి కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజు శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన లేని లోటు ఎవరూ పూడ్చలేరు వారీమృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

కల్వర్టు మరమ్మతులు చేపట్టండి

విశాలాంధ్ర - బొబ్బిలి : పట్టణం కోరాడ వీధి, జండా వీధి, మసీదు వీధి దగ్గర ఉన్న కల్వర్టు భారీ వాహనాలు వెళ్లడంతో కల్వర్టు కూలిపోవడంతో ప్రజల ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గం గుండా పలువురు వాహన చోదకులు ప్రయాణిస్తారని తక్షణమే మున్సిపల్ అధికారులు సమస్య పై స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి నుండి అన్ని ప్రాంతాలకు తాగునీటి సరఫరా

విశాలాంధ్ర - రాజాం : రాజాం ప్రజలకు దాహార్తి తీర్చే త్రాగునీటి సరఫరా కొన్ని ప్రాంతాలకు గత నాలుగు రోజులుగా త్రాగునీరు కుళాయి ద్వారా పంపిణీ లేకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. కమిషనర్ జె.రామప్పల నాయుడు ఆధ్వర్యంలో ఎట్టికేలకు ఈ నాలుగు రోజులు ఇంజనీరింగ్ సిబ్బంది మెకానికల్ సిబ్బంది శ్రమించి వాటర్ పైపులైను లీకు లేకుండా సరి చేసి, ట్రయల్ రన్ వేసి పైప్ లైన్ అంతా తనిఖీ చేసి అనంతరం వాటర్ లిఫ్టింగ్ చేయడం ప్రారంభించారు. ఏఈ.రామ్ వెంకట్ రాజ్ మాట్లాడుతూ పట్టణంలో గత నాలుగు రోజులుగా ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసామని. రేపటి నుండి రాజాంలో మంచినీటి సరఫరా అన్ని ప్రాంతాలకు యధావిధిగా సరఫరా చేయబడునని తెలిపారు.

రామోజీరావుకు ఘనంగా నివాళి

విశాలాంధ్ర - డెంకాడ : పత్రికా రంగంలో నూతన వరవడిని సృష్టించి తెలుగు జాతి గర్వించదగ్గ పారిశ్రామిక రంగాన్ని సృష్టించిన రామోజీరావు ఈరోజు మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం ఈరోజు సందర్భంగా ఈరోజు ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళులు అర్పించి, ఆయన మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన నెల్లిమర్ల నియోజకవర్గం తెదేపా సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర్ రావు డెంకాడ మండలం మాజీ పతివాడ అప్పల నారాయణ డెంకాడ మండలం పార్టీ అధ్యక్షులు పల్లె భాస్కర్ రావు భోగాపురం మండలం పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ విజయనగరం పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కలిదిండి పాణీరాజు రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి పతివాడ శివరామ విద్య సాగర్ నాయుడు మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ కాగితాల సత్యనారాయణ రెడ్డి మాజీ సిహెచ్సి సి చైర్మన్ దంతులూరి ప్రదీప్ రాజు డెంకాడ మండల పార్టీ సెక్రటరీ కొయనేని రమణ యాదవ సాధికార సమితి కన్వీనర్ కొర్నాన ఆదిబాబు రైతు అధ్యక్షులు బంటుపల్లి రామునాయుడు డెంకాడ మండల పార్టీ ఉపాధ్యక్షులు పల్లె భాస్కర్‌రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సేవలు అందిస్తా : ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

విశాలాంధ్ర - లక్కవరపుకోట : శృంగవరపుకోట నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని ఎస్ కట తాజా ఎమ్మెల్యే కోళ లలిత కుమారి అన్నారు. శనివారం మండలంలోని రంగరాయపురం గ్రామంలో మాజీ జడ్పిటిసి సభ్యులు కరెడ్ల ఈశ్వరరావు దగ్గర బంధువు అయినా కరెడ్ల చిన్నారావు (60) అనే వ్యక్తి గత నెల 19న పాముకాటు గురై మృతి చెందిన కారణంగా పెద్ద దిన కర్మ కార్యక్రమానికి ఎమ్మెల్యే లలిత కుమారి, రాంప్రసాద్ దంపతులు విచ్చేసి మృతుడు చిన్నారావు చిత్రపటానికి పుష్పగుచ్ఛా లుంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు అన్యాయాన్ని ఎదిరించి న్యాయాన్ని నిలబెట్టుకున్నారని మరల చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిని చేసి రాష్ట్ర ప్రయోజనాలు రాష్ట్ర భవిష్యత్తు బంగారు బాటలు వేసుకోవడానికి తీర్చిదిద్దుకున్నారని ఆ దిశగా రాబోయే కాలంలో రాష్ట్రం సస్య శ్యామలంగా ఉంటుందని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యులు కరెట్లు ఈశ్వరరావు, సోమయాజులు, దుల్ల మహేశ్వరరావు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రామోజీరావు మృతి చాలా దురదృష్టకరం

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ మల్లిక్ నాయుడు

విశాలాంధ్ర - గరివిడి : పత్రికా రంగంలో నూతన వరవడిని సృష్టించి తెలుగు జాతి గర్వించదగ్గ పారి శ్రామిక రంగాన్ని సృష్టించిన రామోజీరావు ఈ రోజు మన మధ్య లేక పోవడం చాలా బాధాకరం అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ మల్లిక్ నాయుడు అన్నారు. ఆ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలతో నివాళులు అర్పించి, ఆయన మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. టిడిపి కూటమి నాయకులు సమాజానికి రామోజీ చేసిన సేవలను కొనియాడుతూ తమ తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గరివిడి మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీపీ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పైల బలరాం, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ విసినిగిరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వంగర : ఈనాడు సంస్థల అధినేతరామోజీ రావు గారు తెలుగు రాష్ట్రాలకు దేశానికి ఎన్నో సేవలు అందించారని వంగర మాజీ సభ్యులు బొత్స వాసుదేవరావు నాయుడు అన్నారు. ఈరోజు వంగర మండల కేంద్రం లో రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగువారి జీవితాల్లో అత్యంత ప్రభావ వంతమైన ముద్రవేసిన వ్యక్తి రామోజీరావు గారని అన్నారు రామోజీరావు గారు తెలుగు ప్రజల ఆస్తి అని ఆయన మరణం తెలుగు ప్రజలకే కాదు దేశానికి తీరనిలోటని, సమాజ హితం కోసం అనుక్షణం పనిచేసిన ఆయన కీర్తి అజరామరం అని అన్నారు. ఈనాడు గ్రూప్ సంస్థల స్థాపనతో వేల మందికి ఉపాధి కల్పించారని, ఎన్నో కార్యక్రమాల ద్వారా ప్రతిభావంతులను వెలికి తీశారని, రైతన్నలకు అన్నదాత ద్వారా ఎన్నో మెలుకువలు నేర్పించారని, మాతృభాష పరిరక్షణకు విశేషమైన కృషి చేశారని అన్నారు. మీడియా రంగంలో శ్రీ రామోజీ గారిది ప్రత్యేక శకమని, ఎన్నో సవాళ్లను సమస్యలను అధిగమించి ఎక్కడా తలవంచకుండా విలువలతో సంస్థలను నడిపిన విధానం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని అన్నారు. తెలుగు వారందరికీ గర్వకారణమైన శ్రీరామోజీ రావు గారు లేని లోటు పూడ్చలేనిదని ఆయన ఆత్మకు శాంతి కలగాలని అన్నారు. పలు గ్రామాలు కు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు.

కోనూరులో టీడీపీ కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర - గరివిడి : మండలంలో కోనూరు గ్రామంలో తెలుగు దేశం పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు చేతుల మీదుగా ప్రారంభించారు. అంతకుముందు స్థానికంగా ఉన్న శివాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలను పరామర్శించిన రామ్ మల్లిక్ నాయుడు

విశాలాంధ్ర - మెరకముడిదాం : మండలంలోని గొట్టిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సుంకరి పెద్ద సత్యనారాయణ కు గుండె ఆపరేషన్ అయింది. అలాగే కొర్లాం, టిడిపి కార్యకర్త అయిన సత్యనారాయణకు యాక్సిడెంట్ జరిగింది. ఈ విషయం తెలుసుకొని. తెలుగుదేశం పార్టీరాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు వారిని పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తాడ్డే సన్యాసినాయుడు, సీనియర్ నాయకులు కోట్ల మోతి నాయుడు, సుబ్బరాజు, కె.ధనంజయ, తాడ్డే చందు, చంటి, శ్రీరామ్, సి.బంగారు నాయుడు, బొండా సుందర్రావు, సన్యాసి నాయుడు ఎంపీటీసీలు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

కూటి కోసం కోటి విద్యలు అంటున్న వేత కులస్తులు

విశాలాంధ్ర - తెర్లాం : మండలంలో నెమళాం గ్రామానికి చెందిన వేత కులస్తులు బతుకుతెరువు కోసం మండలంలో పలు గ్రామాల్లో చిన్నపాటి తాటి మొక్కలు కమ్మలు కోసి అవి ఎండబెట్టి కట్టలు కట్టి, ఈ ఆరబెట్టిన తాటి కమ్మలతో విసనకర్రలు, కొడుగులను అల్లుకుంటూ అవి అమ్ముకుని జీవనోపాధి కొనసాగిస్తున్నామని వేత కులస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పూర్వీకుల నుంచి మా కుల వృత్తి ఇదే అని మాకు ఏ పని పూర్వీకులు నేర్పారో ఆ పనిని పట్టుకునే రాత్రి అనక పగలు అనక కష్ట పడి కమ్మలు కట్టుకుని ఒక దగ్గర నిల్వ వేసుకుని వర్షాకాలంలో గొడుగులు అల్లుకుని అమ్ముకుంటామని అన్నారు. వేసవి కాలం లో ఇసన కర్రలు కట్టుకుని అమ్ముకుంటున్నమని అన్నారు. ఎంత కష్ట పడిన ఇప్పుడు ఫలితం లేదని, కాలం మారింది అని, అన్ని యంత్రాలు తయారు చేసిన గుబ్బ గొడుగులు, ప్లాస్టిక్ విశన కర్రలు తయారు అయ్యి రావడం తో మేము తయారు చేసే తాటి రేకు గొడుగులు అమ్ముకోలేక ఎన్నో గ్రామాలు తిరిగిన సుఖం లేదని, ఈ కుల వృత్తి తప్ప వేరే పనులు మాకు రావనీ, కుల వృత్తులకు విలువలు లేకుండా పోయాయి అని కానీ మా ప్రాణాలు ఉన్నంత వరకు పిల్లలు పెంచుకోవడానికి పొట్ట పోషణ కొరకు వచ్చిన పనే చేసుకుని బతకాలి కదా అంటూ జీవనోపాధి సాగిస్తున్నాం అని వేత కులస్తులుకు చెందిన రాములు విలేకర్‌తో తెలిపారు.

లలితమ్మకు పశువైద్య సిబ్బంది అభినందనలు

విశాలాంధ్ర - జామి : ఎస్‌కోట నుంచి ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలుపొందిన కోళ్ళ లలిత కుమారిని శనివారం నియోజకవర్గంలోని మండలాలలో పనిచేస్తున్న పశువైద్యాధికారులు శనివారం లక్కవరపుకోటలోని ఆమె నివాసానికి వెళ్ళి అభినందించారు. ఎస్‌కోట ఏరియా వెటర్నరీ ఆసుపత్రి అసిస్టెంట్ డైరెక్టర్ డా. చలపతి ఆద్వర్యంలో జామి అలమండ, బొద్దాం, వేపాడ, దెందేరు, భీమాళి, మల్లివీడు, ఎల్‌కోట ఆసుపత్రులకు చెందిన పశువైద్యాధికారులు అంతా కలిసి లలితమ్మను కలిసి దుశ్శాలువతో సత్కరించారు.

నో పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నో పార్కింగ్ ప్రదే శాల్లో వాహనాలను నిలిపి వేస్తున్నారు. వారిని అదుపు చేసేందుకు ఇటు ఆర్టీసీ అధికారులు గానీ, సెక్యూరిటీ సిబ్బంది గానీ పట్టించుకునే పరిస్థితి లేదు. దీంతో అటుగా వెళ్లే ఆర్టీసీ బస్సులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతిరోజు ఎంతో మంది ప్రయాణికులను దింపేందుకు లేదా తీసుకు వెళ్లేందుకు వివిధ వాహనాలు లోనికి వస్తూ ఉంటాయి. కనీసం వాళ్లకు వాహనాలు ఎక్కడ పెట్టాలో తెలియక ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతమంతా కూడా పూర్తిగా వివిధ దుకాణాలతో నిండిపోయింది. కనీసం బస్సులు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు పలు ప్రమాదాలు లేదా దొంగతనాలు జరుగుతున్నప్పటికీ వాటిని అదుపు చేసేందుకు కనీసం పట్టించుకోలేని పరిస్థితిలో ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది ఉంది. వాహనాలు లోనికి వచ్చేటప్పుడు సంబంధిత సిబ్బంది వాటిని ఎక్కడ పార్కింగ్ చేయాలో చెప్పలేని పరిస్థితుల్లో ఉన్నారు. ఎటు చూసినా నో పార్కింగ్ బోర్డులు కనబడడంతో వాహనాలు ఎక్కడ నిలపాలో తెలియక కాంప్లెక్స్ లోని కూడా వచ్చేందుకు భయపడుతున్న పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా ప్రయాణికుల కోసం వచ్చే వాహనదారులకు సరైన పార్కింగ్ స్థలాన్ని ఆర్టీసీ వారు ఏర్పాటు చేస్తారని ఆశిద్దాం

మన జీవితాలను మార్చగల శక్తి పుస్తకాలకే ఉంది : ఆశయ వ్యవస్థాపకుడు రెడ్డి రమణ

విశాలాంధ్ర - గరివిడి : మండలంలో బాగువలస గ్రామంలో ఆశయ యూత్ అసోషియేషన్, ఆశయ రూరల్ లైబ్రరీ ఆధ్వర్యంలో విద్యార్థులు చెంతకే సంచార గ్రంధా లయం గ్రామంలో శివాలయం వద్ద ఏర్పాటు చేయడం జరిగింది. విద్యార్థులకు పుస్తక పఠనం పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ మాట్లాడుతూ తల్లి దండ్రులు పిల్లలకు పుస్తకాలు చదవడం. అలవాటు. చేయాలని, కథలు పుస్తకాలు, ఆధ్యాత్మిక, నైతిక విలువలు పుస్తకాలు గురించి వారికి. తెలియ జేయాలని ప్రతి రోజు క్రమం తప్పకుండా రోజుకు రెండు గంటలు అయినా పుస్తకాలు చదవాడానికి. ఉపాధ్యాయులు విద్యార్థులకు పుస్తకాలు చదవడం. అలవాటు. చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశయ సంస్థ సభ్యులు. సాయి,. జగదీష్, రవి విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఆహ్లాదకరమైన ఆటవిడుపు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : శృంగవరపుకోట కేంబ్రిడ్జ్ నారాయణ, ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గత నెలరోజులుగా నిర్వహిస్తున్న వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం ముగిసిన నేపథ్యంలో క్రీడాకారులకు ఆటవిడుపుగా ఎస్.కోటలోని శిరికి రిసార్ట్స్ స్విమ్మింగ్ పూల్ కి శనివారం తీసుకుని వెళ్లారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో క్రీడాకారులతో ఈత (స్విమ్మింగ్)ను చీఫ్ కోచ్ డాక్టర్ శ్రీరాములు, కోచ్ లు మహమ్మద్ అస్లాం, బి.హారిక, పి మౌనికలు సాధన చేయించారు. క్రీడాకారులు ఆనందానికి అవధులు లేకుండా ఎంజాయ్ చేశారు.

రామోజీరావు మృతి బాధాకరం

విజయనగరం జిల్లా టీడీపీ అధ్యక్షులు కిమిడి నాగార్జున

విశాలాంధ్ర - విజయనగరం అర్బన్ : అక్షర యోధుడిగా పేరుగాంచిన....క్రమశిక్షణ, పట్టుదల, దీక్ష, అంకితభావంతో ముందుకుసాగి దశాబ్దాల కాలంగా మీడియా రంగంలో మహారాజుగా నిలిచిన ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ చెరుకూరి రామోజీరావు మృతి చాలా బాధాకరమని, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలకు తీరని లోటని విజయనగరం జిల్లా టిడిపి అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. రామోజీరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. రామోజీరావు తెలుగు భాష, జర్నలిజానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. జర్నలిజాన్ని ఒక స్థాయికి తీసుకెళ్లిన ఘనత రామోజీరావుకే దక్కుతుందన్నారు. రామోజీరావు అడుగు పెట్టిన ప్రతీ రంగంలోనూ నిబద్ధత, అంకితభావం, పట్టుదల, దీక్షతో ముందుకు సాగారన్నారు. ఆయన తెలుగు సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు.

విజయనగరం నియోజకవర్గ ఎమ్మెల్యే అదితి గజపతిరాజు : రామోజీ రావు మరణించినందుకు నేను చాలా బాధపడ్డాను. జర్నలిజం మరియు మీడియాకు ఆయన అందించిన గణనీయమైన కృషి సమాజంపై శాశ్వత ప్రభావాన్ని చూపింది. నిజమైన దార్శనికుడిగా, అతని వారసత్వం చాలా మందికి స్ఫూర్తినిస్తూనే ఉంటుంది. ఈ క్లిష్ట సమయంలో అతని కుటుంబ సభ్యులకు మరియు ప్రియమైన వారికి నా హృదయపూర్వక సానుభూతి తెలియజేస్తున్నాను. అతని ఆత్మకు శాంతి కలగాలని ఒక ప్రకటనలో తెలిపారు.

నవధాన్య విత్తనాలు వేద్దాం.. భూసారాన్ని పెంచుదాం

విశాలాంధ్ర - శృంగవరపుకోట : వరి పంట సాగుకు ముందు నవధాన్య విత్తనాలు వేసి భూసారాన్ని పెంచాలని రైతులకు మండల వ్యవసాయాధికారి రవీంద్ర పిలుపునిచ్చారు. శృంగవరపుకోట మండలంలోని సంత గైరంపేట, వినాయకపల్లి గ్రామాల్లోని రైతులకు నవధాన్యాల కిట్లను ఏవో రవీంద్ర చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవధాన్యాలు సాగు చేయడం ద్వారా భూసారాన్ని పెంచుకోవచ్చని రైతులకు తెలియజేశారు. రైతు భరోసా కేంద్రం ద్వారా వచ్చిన జనుము, జీలుగు, పిల్లి పెసరతో పాటు రైతుల వద్ద ఉన్న మినుములు, పెసలు, ఉలవలు, కందులు, ఆకుకూర, కూరగాయ విత్తనాలను కలిపి వరి సాగుకు ముందు ఎకరాకు 10 నుంచి 12 కేజీలు వేసినట్లయితే భూమిలో ఉన్న పోషకాలు పెరగడమే కాకుండా పంటకు అవసరమయ్యే పోషకాలు సిద్ధం చేసుకున్నందుకు వీలుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ రవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎంటి కోటి బాబు, ఎల్ వన్ లు మల్లేష్ నాయుడు, చరణ్, రైతులు పాల్గొన్నారు.

రామోజీ మృతి తీరని లోటు : ఎస్టీ కమిషన్ ఛైర్మన్ శంకరరావు

విశాలాంధ్ర - విజయనగరం : రామోజీ రావు మృతితో ఈనాడు తెలుగు వెలుగు కొంచెం మసకబారిందనీ రామోజీ మరణం తీరనిలోటని ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డివిజి శంకరరావు అన్నారు. తెలుగు భాష కు,తెలుగు జాతికి ఆయన చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు..ఆయన స్థాపించిన ఈనాడు దినపత్రిక అప్పటి తెలుగు పత్రికా రంగంలో ఒక సంచలనంగా పేర్కొన్నారు. నలుగురూ మాట్లాడే వ్యావహారిక శైలితో,ఆకట్టుకునే కథనాలతో, విభిన్న వార్తలతో ఉదయాన్నే పాఠకులకు చేరుతూ త్వరితంగానే తెలుగువారికి వ్యసనంగా తయారైందన్నారు.. దశాబ్దాలు గడిచినా ఆయన నేతృత్వంలో ఈనాడు పత్రిక సుస్థిరం గా తన స్థానాన్ని నిలుపుకుందని పేర్కొన్నారు. .దశాబ్దాల రాజకీయ చైతన్యానికి వేదికగా, వాహకంగా పనిచేసిందన్నారు.. నందమూరి తారక రామారావు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ ఏర్పడి తొమ్మిది నెలల్లో ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో, ఈనాడు అందించిన తోడ్పాటు గణింప వీలుకానిదని పేర్కొన్నారు..ఈనాడుతో బాటు తెలుగువెలుగు, విపుల, చతుర తదితర పత్రికల నిర్వహణ ద్వారా రామోజీ స్వచ్ఛమైన,అచ్చమైన తెలుగు భాష వ్యాప్తికి దోహదపడ్డాయన్నారు.ఈనాడు ఆధ్వర్యంలో వివిధ సామాజిక చైతన్య, సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల్ని భాగస్వాములను చేస్తూ ముందుండి నడిపించారన్నారు. జర్నలిస్టు గా, సంపాదకునిగా, వ్యాపారవేత్తగా ఆయన సాధించిన విజయాలు, గుర్తింపు అనితర సాధ్యమన్నారు. తెలుగు జాతి చరిత్ర పుస్తకంలో ఆయనది ఒక విస్మరింప వీలుగాని పుట. చెరిగిపోని ముద్రని ఆయన అన్నారు. .

వేణుగోపాల స్వామి ఆలయ ఈవోపై ఎమ్మెల్యే బేబీనాయన ఆగ్రహం!

విశాలాంధ్ర - బొబ్బిలి : శ్రీ వేణుగోపాల స్వామి ఆలయానికి చెందిన గుర్రపు కోనేరులో గల మండపంలో విగ్రహాలను దొంగిలించినట్లు గత నెల హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేసిన నేటి వరకు పోలీసులు దర్యాప్తు చేపట్టడంలో విఫలం చెందారని కూటమి ఎమ్మెల్యే ఆర్ వి ఎస్ కే కే రంగారావు (బేబినాయన) పోలీస్ శాఖ తీరుపై మండిపడ్డారు.రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ఆ విగ్రహాలను మళ్లీ మండపంలో తిరిగి పెట్టినట్లు తెలియగా శనివారం ఎమ్మెల్యే ఆర్‌విఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు పువ్వుల శ్రీనివాసరావు, సాయి రమేష్, రవి, అనిల్ తో కలిసి మండపాన్ని సందర్శించారు.దేవాదాయ శాఖకు చెందిన ప్రాంతంలో చేపల వ్యాపారస్తులకు అనుమతులు ఎలా విధంగా ఇచ్చారంటూ శీవేణుగోపాల స్వామి ఆలయ ఈఓ పై ఆగ్రహం వ్యక్తం చేశారు.మండపం విషయంలో ఇంత జరుగుతున్నా ఎండోమెంట్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరం అన్నారు. ఎవరి అండదండలతో ఇదంతా జరిగిందో విచారణ జరిపిస్తామని, ఈ విషయంలో ఎంతటివారు ఉన్నా కూడా విడిచిపెట్టేది లేదని, వారికి తగిన శిక్ష పడేలా చేస్తామని కూటమి ఎమ్మెల్యే ఆర్‌విఎస్ కేకే రంగారావు అన్నారు.

కందాళ సుబ్రహ్మణ్య తిలక్ చిరస్మరణీయులు

విశాలాంధ్ర - విజయనగరం రూరల్ : స్వాతంత్ర సమరయోధుడు, భారత మొదటి పార్లమెంటేరియన్ కందాళ సుబ్రహ్మణ్య తిలక్ చిరస్మరణీయులని సీనియర్ న్యాయవాది ఫోర్.ఎస్.రాజు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఉడా కాలనీలో ఉన్న తిలక్ ఫౌండేషన్ కార్యాలయంలో తిలక్ ఐదవ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఫౌండేషన్ ప్రతినిధులు సుబ్రమణ్య తిలక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు ఫోర్.ఎస్. రాజు మాట్లాడుతూ తిలక్ అభ్యుదయ భావాలు కలిగిన వారని, అయిన బ్రాహ్మణుడైనప్పటికీ దళిత సంక్షేమానికి, దళిత విద్యార్థుల చదువులకు ప్రాధాన్యత ఇచ్చి తన సొంత ధనాన్ని ఖర్చు చేసి దళిత యువత ఉన్నత చదువులు, ఉన్నత ఉద్యోగాల సముపార్జనకు కృషి చేశారని పేర్కొన్నారు. కుల వ్యవస్థ నిర్మూలనకు పని చేసిన మొదటి వ్యక్తి తిలక్ అని ఘనంగా నివాళులు అర్పించారు. సోషలిస్ట్ భావాలు కలిగిన తిలక్ ను నేటి సమాజం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిలక్ ఫౌండేషన్ కార్యదర్శి, గురుస్వామి కందాళ సాయిబాబా, వాకర్స్ క్లబ్ ఫాస్ట్ గవర్నర్ కొత్తలి ఎర్రి నాయుడు, సీతారామచంద్ర వర్మ, కే.వి. రామకృష్ణ, కొల్లి సత్యం, కందాళ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

అవంతిలో వైర్డు యాక్సెస్ నెట్వర్క్‌పై వర్క్ షాప్

విశాలాంధ్ర - భోగాపురం : తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ విభాగం నందువైర్డు యాక్సెస్ నెట్వర్క్ పై వర్క్ షాప్ నిర్వహించారు. విశాఖపట్నం బి.ఎస్.ఎన్.ఎల్ వారి సహకారంతో "వైర్డు యాక్సెస్ నెట్వర్క్ పై వర్క్ షాప్ (ఆప్టికల్ ఫైబర్ కమ్యూనికేషన్) కస్టమర్ ప్రెమిసెస్ పరికరాలు"పై వర్క్ షాప్ నిర్వహించడం జరిగింది. బి.ఎస్.ఎన్.ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ సోర్స్ పర్సన్ డా.ఎం.సత్య ప్రసాద్ మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధిలో బి.ఎస్.ఎన్.ఎల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఎలా కీలక పాత్ర పోషించిందో వివరిస్తూ 5జి సాంకేతికతకు ఫైబర్ ఆప్టిక్ కమ్యూనికేషన్ ఏలా ఉపయోగ పడుతుందో తెలిపారు. ఈ వర్క్ షాప్‌లో బాగంగా వైర్డు యాక్సెస్ పరికరాలు పని చేసే విధానాన్ని బి.ఎస్.ఎన్.ఎల్ నిపుణులు చూపించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.మురళీకృష్ణ, మాట్లాడుతూ విద్యా వేత్తలు, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడానికి ఇటువంటి వర్క్ షాప్ ఉపయోగ పడుతుందని తెలిపారు కళాశాల డైరెక్టర్ డా.ఎ. చంద్రశేఖర్ మాట్లాడుతూ పరిశ్రమల్లో డిమాండ్ కు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఇ.సి.ఇ విభాగదిపతి శివ భాస్కర్ రావు, కమ్యూనికేషన్‌లో ఇటీవలి జరిగిన నూతన సాంకేతిక అభివృద్ధి గురించి వివరించారు. ఈ వర్క షాప్ లో 72 మందీ అధ్యాపకులు మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు కుమరాం వెంకన్న సిద్ధం

విశాలాంధ్ర - జామి : మండలంలోని కుమరాంలోని శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అంతా సిద్ధం చేస్తున్నారు. ఈనెల 16నుంచి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు భీమసింగి కర్మాగార ఎండి విక్టర్ రాజు తెలిపారు. ఉత్సవాలలో భాగంగా శనివారం ఆలయ ఆవరణలో వెంకటన్నకు పందిరిరాట కార్యక్రమాన్ని నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ, వేలాదిమంది భక్తుల గోవింద నామస్మరణతో స్వామికి పందిరి రాట వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆలయంలో పద్మావతి సమేత శ్రీకళ్యాణ వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు చేసారు. ప్రతీ ఏడాది శ్రీకళ్యాణ వేంకటేశ్వర స్వామి ఉత్సవాలకి అటు కర్మాగార సిబ్బంది నుంచి స్థానిక భక్తుల నుంచి విశేష మద్దతు లభి స్తోంది. దీంతో ప్రతీ ఏటా అంగరంగ వైభవంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.

గ్రూపు రాజకీయాలతో కుదేలైన వైకాపా?

గ్రామస్థాయిలో వర్గాలను పెంచి పోషించిన మండల స్థాయి నాయకులు

పట్టీ పట్టనట్లు వ్యవహరించిన జిల్లా అధిష్టానం

విశాలాంధ్ర - మెరకముడిదాం : రాష్ట్రంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైకాపా ఘోర పరాజయాన్ని చవిచూసింది. రాష్ట్రస్థాయిలో సంక్షేమం, అభివృద్ధి జరిగినప్పటికీ పార్టీ ఇంత ఘోర పరాజయాన్ని మూట కట్టుకోవడానికి ఆ పార్టీలో మండల, గ్రామ స్థాయిలో అంతర్గత విభేదాలు , గ్రూపు రాజకీయాలే అని ప్రజలు బాహాటంగా వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రూపు రాజకీయాలనేవి స్థానిక ఎన్నికలు అయినప్పటినుండి చాప కింద నీరులా ఉన్నాయి. అయితే ఈ గ్రూపు రాజకీయాల్లో జిల్లా అధిష్టానంకి తెలిసినప్పటికీ స్థానిక మాజీ శాసనసభ్యులు మంత్రివర్యులు బొత్స సత్యనారాయణకు చేరలేదు. ఎన్నికల సమీపిస్తున్న సమయానికి మాజీ మంత్రివర్యులుకి తెలిసినప్పటికీ.ఎవరిని మందలిస్తేఏమవుతుదో అని ఆయన గుంభనంగా వ్యవహరించారు. సరైన సమయం కోసం వేచి చూస్తున్న అసంతృప్తి ద్వితీయ శ్రేణి నాయకులు, సీనియర్ నాయకులు కిమిడి కళా వెంకట్రావుకి సీటు కేటాయించడంతో చిన్న చూపుకి గురైన ద్వితీయశ్రేణి నాయకత్వం అంతా కూడా పార్టీని వీడారు. పదవులు పందారంలో ఒకే కుటుంబానికి అన్ని ఉండడం, నామినేటెడ్ పదవులు ఉన్నప్పటికీ ద్వితీయశ్రేణి నాయకత్వానికి ఇవ్వకపోవడంతో వాళ్లలో అసంతృప్తి సెగ మొదలైంది. దీనికి మచ్చుతునకే గర్భాం మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి. ఇలా ప్రతి గ్రామంలో కూడా వార్డు మెంబర్ల నుండి సర్పంచిల వరకు మండల స్థాయిలో విలువ లేకుండా పోయింది. మండల స్థాయి నాయకులు అంతా తానై వ్యవహరించడం. గ్రామ రాజకీయాల్లో మండల స్థాయి నాయకులు వేలు పెట్టడం, మండల స్థాయి నాయకుల రాజకీయాల్లో జిల్లా స్థాయి నాయకులు వేలు పెట్టడం, ఇదంతా రాష్ట్రస్థాయి నాయకుడికి తెలియకపోవడం ఓటమికి కారణంగా ప్రజలు చర్చించుకుంటున్నారు. దీనికి తోడు గ్రామ స్థాయి నాయకులు కూడా ప్రజలను చిన్నచూపు చూడ్డం, సంక్షేమ పథకాలు కావాలంటే తమ గడప తొక్కాలని ఆదేశాలు జారీ చేయడం, గ్రామస్థాయి నాయకులు అధికారులను కూడా బెదిరించే స్థాయికి వెళ్లడం మండలంలో జరిగేది. నియోజకవర్గంలో వైకాపా పార్టీకి మెరక ముడిదాం కంచుకోట అనేది జగమెరిగిన సత్యం. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో కూడా నువ్వా నేనా అన్నట్లు ఓట్లు వచ్చాయి. ఈ గ్రూపు రాజకీయాలు లేకుండా ఉండి ఉంటే బొత్స గెలుపు నల్లేరు మీద నడకలా ఉండేది. తన నియోజకవర్గంలో రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రతి గ్రామంలో యువనాయకత్వాన్ని ప్రోత్సహిస్తూ, మంత్రి కుమారులు సందీప్ గ్రామస్థాయిలో అందుబాటులో ఉంటే స్థానిక ఎన్నికల్లో మంచి ఫలితం ఉంటుందని మండల ప్రజానీకం అనుకుంటున్నారు. ఇకనైనా మండల స్థాయి నాయకులు గ్రామస్థాయిలో యువ నాయకులను ప్రోత్సహిస్తూ, వారి వెన్నంటే ఉంటే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థి గెలుపుకి అవకాశాలు మెండుగా ఉంటాయి.

ఈనాడు అధినేత రామోజీరావుకు ఘన నివాళులు

విశాలాంధ్ర - విజయనగరం అర్బన్ : ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు చిత్ర పటానికి టిడిపి పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాలో శనివారం టిడిపి పట్టణ అధ్యక్షులు లక్ష్మీ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. రామోజీరావు మృతి అత్యంత బాధా కరమని అయన లేని లోటు పత్రికా లోకానికే తీరని లోటని, టిడిపి మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, టిడిపి నాయకులు ఆల్తి బంగారు రాజు, పోలి నాయుడు పేర్కొన్నారు. రామోజీరావు లాంటి వ్యక్తి మన మధ్య లేక పోయినా ఆయన ఆశయాలు ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచి పోయాయని వారు గుర్తు చేశారు .. ఆయా రాష్ట్రాల్లో ప్రజల కోరిక మేరకు ఆయా ప్రాంతీయ బాషల్లో ఈనాడు దినపత్రిక తో పాటు ఈటీవీ ప్రసార మాధ్యమాలు , రామోజీ గ్రూప్ సంస్థలు,ప్రియా సంస్థల పేరుతో పచ్చళ్ళు, వంట నూనెలు, దేశంలోనే అత్యంత పర్యాటక కేంద్రంగా రామోజీ ఫిల్మ్ సిటీ వంటివి స్థాపించారన్నారు. ఆయన పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూర్చాలని వారి కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గాయత్రి విద్యాసంస్థల కరస్పాండెంట్ గోవింద నాయుడి సేవలను కొనియాడిన ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు

విశాలాంధ్ర - బొబ్బిలి : స్థానిక గాయత్రి విద్య సంస్థల కరస్పాండెంట్ కీర్తి శేషులు పోల గోవింద నాయుడు అకాల మృతికి బొబ్బిలి ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలు ఏపిపియుఎస్ ఎంఎ యూనియన్ నాయకులు అభ్యుదయ విద్యాసంస్థల కరస్పాండెంట్ మర్రపు కూర్మనాయుడు (నాని)శ్రీ సూర్య విద్యాలయ కరస్పాండెంట్ శ్రీనివాస్, శ్రీ చైతన్య విద్యానికేతన్ కరస్పాండెంట్ గౌరీశంకర్, జిఎస్ఎస్ స్కూల్ కరస్పాండెంట్, నాగచంద్ర, వెంకటేశ్వర స్కూల్ కరస్పాండెంట్ నాగభూషణం, సెవెంత్ డే పాఠశాల కరస్పాండెంట్, కాంతిలాల్, ఏషియన్ బ్లైండ్ స్కూల్, నోబెల్ స్కూల్ శారద. మరియు చుక్క రమణలు గోవిందరావు అకాల మృతికి శ్రద్ధాంజలి ఘటిస్తూ యూనియన్ కి చేసిన సేవలను కొనియాడారు.

ఎమ్మెల్యే బేబినాయనకు ఘన సత్కారం

విశాలాంధ్ర - బాడంగి : మండలం పిన్నవలస సమీపంలో మాజీ ఎమ్మెల్యే లక్ష్మునాయుడు గెస్ట్ హౌస్ దగ్గర,. బొబ్బిలి శాసన సభ్యులు బేబి నాయన మరియు మాజీ శాసన సభ్యులు తెంటు లక్ష్ము నాయుడు ఎరుకుల పాకలు గ్రామ పెద్దలతో కలిసి పాలవలస గౌరు ఎంపీటీసీ, రాష్ట్ర సెల్ జనరల్ సెక్రటరీ. బారీ మందుగుండు సామాగ్రితో స్వాగతించి శాలువాలుతో ఘనంగా శనివారం సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం సర్పంచ్ పాలవలస పార్వతి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా పాలవలస గౌరు మాట్లాడుతూ గత ప్రభుత్వం గడిచిన ఐదు సమత్సరాలులో వైసీపీ నాయకులు గుండా రాజకీయాలు చేస్తూ నన్ను మా గ్రామ ప్రజలను ఎన్నో రకాలుగా ఇబ్బందులకు గురి చేసారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేబి నాయన మాట్లాడుతూ కార్యకర్తలు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూసుకొంటా మన్నరు. ఈ కార్యక్రమంలో తెంటు రవిబాబు, ఎల్ సత్యం.తోపాటు పలు గ్రామాల . నాయకులు కార్యకర్తల పాల్గొన్నారు.

13వ తేదీన కామాక్షి అమ్మవారి దేవాలయం పంచమ వార్షికోత్సవము

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : జ్యేష్ఠ శుద్ధ సప్తమి గురువారం బొండాడ వీధిలో వేంచేసియున్న మహాగణపతి శ్రీ కామాక్షి సమేత ఏకాంబరేశ్వర స్వామి వారి దేవాలయ పంచమ వార్షికోత్సవ ఉత్సవములు నిర్వహించ బడునని ఆలయ పాలక మండలి అధ్యక్షుడు అప్పలబత్తుల సోమరాజు తెలిపారు. శనివారం దేవాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 13వ తేదీ ఉదయం 6.00 గంటల నుండి పంచామృత అభిషేకములు, అలంకరణ, కలశస్థాపన, అర్చన, భూపుర శ్రీ చక్ర అలంకరణ, దేవి దేవతా మూర్తుల హవణం 9.00గంటలకు మూలమూర్తులకు ప్రత్యేక వస్త్ర ఆభరణ అలంకరణ ,10.00 గంటలకు సువాసినిలతో శ్రీచక్ర సహస్రకుంకుమార్చన, లలితాపారాయణము హరే శ్రీనివాస్ బృందం వారిచే సాయంత్రం కోలాట కార్యక్రమము, 6.00 గంటలకు శ్రీశ్రీశ్రీ కామాక్షి దేవి ఏకాంబరేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించబడునని ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ లక్కోజు ఓంకార్ ఆచార్య సిద్ధాంతి తెలిపారు. ఆలయ వార్షికోత్సవము సందర్భంగా అమ్మవారికి 108 చీరలతో అలంకరణ జరుగునని చెప్పారు. ఈ సందర్భంగా వార్షికోత్సవ కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమములో ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

అక్షర యోధునికి మండల టీడీపీ అశ్రునివాళి

విశాలాంధ్ర - జామి : అక్షరాన్ని ఆయుధంగా చేసుకొని నవ సమాజ నిర్మాణానికి నాంది పలికిన ఈనాడు గ్రూప్ సంస్థల అధిపతి చెరుకూరి రామోజీరావు ఆకస్మిక మృతి పట్ల మండల టిడిపి సంతాపం వ్యక్తం చేసింది. ఈ మేరకు శనివారం సాయంత్రం మండల కేంద్రమైన జామి లోని శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో రామోజీరావు సంతాప సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల టిడిపి నేతలు బండారు పెద్దబాబు, వర్రి రమణ, పోలిపర్తి స్వామి నాయుడు, ధనియాల పైడిరాజు తదితరులు మాట్లాడారు. ముందుగా రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈనాడు పత్రిక ద్వారా అనేకమంది పాత్రికేయులను తీర్చిదిద్దిన మహనీయుడు అన్నారు. వ్యాపారాలతో పాటు సమాజ సేవకు తన వంతు పూర్తిస్థాయిలో కృషి చేశారన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా అనేక అవార్డులను అందుకున్నారని తెలిపారు. అటువంటి మహనీయునుకు ప్రభుత్వ లాంచనాలతో అంత్యక్రియలు జరగడం ఎంతో బాధ్యతగా గుర్తించాలన్నారు. ఆయన మృతి పత్రిక రంగానికే గాక రాష్ట్ర అభివృద్ధికి లోటుగా తెలిపారు. ఈ కార్యక్రమానికి వెలమ సాధికార సమితి డైరెక్టర్ విజయ్ కుమార్ హాజరై రామోజీరావుకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు.